క్లుప్తంగా

ఘనంగా మాస కల్యాణం



వేంకటేశ్వరస్వామి మాస కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పెరవలి: పెరవలి మండలం అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి, అమ్మవార్లకు మాస కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. మహా శివరాత్రి, మాస కల్యాణం కలసి రావడంతో వందలాది మంది భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణం తిలకించారు. స్వామి వారి కల్యాణం చేయించుకున్న వారి దంపతులు ఎంతో అన్యోన్యంగా ఉండటమే కాకుండా, వారికి ఎటువంటి బాధలు లేకుండా ఉంటారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన మాస కల్యాణం ప్రతి నెలా జరుపుతామని, అంతే కాకుండా ఆలయ అభివృద్ధి కోసం నిత్యగోత్రనామార్చన, లక్షతులసి పూజలు, హోమాలు, అన్న సమారాధన, అలంకరణ వంటి కార్యక్రమాలు చేపట్టామని దీనికి భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తున్నామని తెలిపారు.

రేపు విద్యుత్ అంతరాయం

గోపాలపురం: మండలంలోని గోపాలపురం 33/11కేవీ సబ్‌స్టేషన్, జగన్నాథపురం 33/11కేవీ సబ్‌స్టేషన్ల వార్షిక మరమ్మతుల్లో భాగంగా 28వ తేదీ శుక్రవారం విద్యుత్ నిలుపుదల చేస్తామని నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకూ నిలుపుదల చేస్తామన్నారు. ఈ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న 11 కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలుదల చేస్తామని అందువల్ల వేళ్లచింతలగూడెం, భీమోలు, గుడ్డిగూడెం, తొక్కిరెడ్డిగూడెం, కొవ్వూరుపాడు, కరగపాడు, వాదాలకుంట, వెదుళ్లకుంట, జగన్నాథపురం సబ్‌స్టేషన్ పరిధిలోని కోమటికుంట, కరిచర్లగూడెం, నందిగూడెం, రేగులగుంట, సంజీవపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేడయం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఈఈ అప్పారావు కోరారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా



సూర్యనారాయణపురం వద్ద హైవేపై డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన కారు

దేవరపల్లి: గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై దేవరపల్లి మండలం యర్నగూడెం శివారు సూర్యనారాయణపురం వద్ద బుధవారం ఏలూరు వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న కారు అతివేగంగా వస్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాద సమయంలో కారు బెలూన్స్ సకాలంలో తెరచుకోవడంతో డ్రైవర్ సురక్షితంగా బయపడ్డాడు. డివైడర్‌ను ఢీ కొన్న కారు సుమారు 100 మీటర్లు ముందుకు దూసుకుపోయింది.

గోవులు, గేదెలను తరలిస్తున్న కంటైనర్ సీజ్

రాజమహేంద్రవరం రూరల్: విజయనగరం జిల్లా నుంచి కేరళకు ఎద్దులు, గేదెలను తరలిస్తున్న కంటైనర్‌ను బుధవారం దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద గోసేవ ఫౌండేషన్ సభ్యులు అడ్డుకున్నారు. వారి సమాచారం మేరకు బొమ్మూరు ఎస్సై ప్రియకుమార్, సిబ్బందితో వెళ్లి కంటైనర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. గోసేవ ఫౌండేషన్ అధ్యక్షుడు మోటుపల్లి సాయిరంగ భాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కంటైనర్‌లోని 20 ఎద్దులు, 17 గేదెలను రాజమహేంద్రవరంలోని గోశాలకు తరలించినట్లు ఎస్సై ప్రియకుమార్ తెలిపారు.



వెలగదుర్రులో స్వామివారి రథోత్సవం



అన్నవరప్పాడులో స్పటిక లింగానికి చేస్తున్న అభిషేకం



తీపర్రులో రథాన్ని లాగుతున్న భక్తులు



అన్నవరప్పాడులో జాతీయ రహదారిపై క్యూలో నిల్చొన్న భక్తులు

హరహర మహాదేవ.. శంభోశంకర

- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- భక్తజన సంద్రమైన గోష్పాదక్షేత్రం
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కొవ్వూరు: మహాశివరాత్రి వేడుకలు బుధవారం నియోజకవర్గంలో వైభవంగా జరిగాయి. స్థానిక గోష్పాదక్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. సుమారు 50 మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పట్టణ సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పురపాలక సంఘం శానిటేషన్ సిబ్బంది పారిశుధ్యం మెరుగు పరిచారు. అవంతి ఫుడ్స్ ఆధ్వర్యంలో భక్తులకు పాలు పంపిణీ చేశారు. ఆ సంఘ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అల్లూరి వెంకట్ సంజీవ్ సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రెస్ రిపోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు నల్లా స్వామి నాయుడు, సభ్యులు పాల్గొన్నారు. వాడపల్లిలో అనంత భోగేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. మద్దూరులో రాజరాజేశ్వరీ సమేత మల్లేశ్వరస్వామి, తొగుమ్మి, దొమ్మేరు, ఐ.పంగిడి గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోష్పాదక్షేత్రంలో లింగోద్భవకాలంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెరవలి: మాఘమాసం మహాశివరాత్రి బుధవారం రావడంతో వేలాది మంది భక్తుల శివనామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని కానూరు, కానూరు అగ్రహారం, తీపర్రు, పెరవలి, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, మల్లేశ్వరం, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, కడింపాడు గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా అన్నవరప్పాడు, మల్లేశ్వరం, తీపర్రు, ఖండవల్లి, ముక్కామల గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నవరప్పాడులో వేంచేసిన విశ్వేశ్వరస్వామికి వేలాది మంది భక్తుల సమక్షంలో ఒంటి గంటకు 312 మంది దంపతులతో ఒకేసారి అభిషేకాలు నిర్వహించారు. ఇదే సమయంలో మంత్రి కందుల దుర్గేష్ అన్నవరప్పాడులో స్పటిక లింగాన్ని, తీపర్రులో రాజరాజనరేంద్రస్వామిని దర్శించుకున్నారు. మల్లేశ్వరంలో స్వయంభూగా వేంచేసిన కపిల మల్లేశ్వరస్వామి, ముక్కామలలో ఉమా సోమేశ్వరస్వామి, తీపర్రులో రాజరాజనరేంద్ర స్వామిలకు అభిషేకాలు నిర్వహించారు. తీపర్రులో ఉదయం 10 గంటలకు మ్యూజికల్ నైట్, 11 గంటలకు వీరభద్రుని సంబరం, 4 గంటలకు రథోత్సవం నిర్వహించారు. రథోత్సవంలో యువతీయువకులు అధిక సంఖ్యలో పాల్గొని రథంపై ఉన్న శిఖరాన్ని అరటిపండ్లతో కొట్టారు. మండలంలో అన్నవరప్పాడు, తీపర్రు, మల్లేశ్వరం, ఖండవల్లి ఆలయాల వద్ద భోజన వసతి భక్తులు స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేశారు. అన్నవరప్పాడులో జాతీయ రహదారి పక్కన విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్పటిక లింగ దర్శనం బుధవారం 50 వేల మంది దర్శించుకున్నారు.



కొవ్వూరు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సుందరేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

ఉండ్రాజవరంలో..

ఉండ్రాజవరం: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని గ్రామాల్లోని శైవ క్షేత్రాలకు బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. పాలంగిలో బాలాత్రిపుర సుందరీ దేవి సమేత రామలింగేశ్వర స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. ఏపీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వి.శేషురఘుబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు పాలంగి వాసవి మాత ఆర్యవైశ్య యువజన సంఘం వారు ప్రసాద వితరణ చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉండ్రాజవరంలోని బాలా త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వర స్వామికి తెల్లవారుజామున పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే పలు గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

నిడదవోలులో..

నిడదవోలు: హరహర మహాదేవా.. శంభోశంకర అంటూ భక్తుల హరనామస్మరణతో శైవక్షేత్రాల ప్రాంగణాలు మార్మోగాయి. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం పట్టణంలో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలో పశ్చిమడెల్టా ప్రధాన కాలువ చినకాశి రేవులో వేకువజామున భక్తులు అధికంగా తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడ నుంచి శివ నామాన్ని స్మరిస్తూ శివుని ఆలయాలకు తరలివెళ్లారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత గోలింగేశ్వర స్వామి ఆలయంలో వేకువజామున నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. నిడదవోలు పరిసర ప్రాంతాల నుంచి సుమారు 6 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిడదవోలు వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఉప్పల సతీష్ ఆధ్వర్యంలో భక్తులకు పాలు, మంచినీటి సదుపాయం కల్పించారు.

చాగల్లు: మహాశివరాత్రి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. వేకువజామున నుంచి భక్తులు శివాలయాలకు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలు ఆలయాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్థానిక రాజరాజేశ్వరస్వామి ఆలయానికి భక్తులు బారులు తీరారు. బ్రాహ్మణగూడెం బాలరామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మేళతాళాలు, విచిత్ర వేషధారణలతో ఊరేగింపు నిర్వహించారు. ఊనగట్ల ఉమారామలింగలేశ్వరస్వామి, ధారవరం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయా గ్రామాల్లో స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. మార్కొండపాడు, చిక్కాల, కలవలపల్లి, నందిగంపాడు, మల్లవరం గ్రామాల్లోనూ శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీల సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తాళ్లపూడి: శివనామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. మహాశివరాత్రి వేడుకలు మండలంలో వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. తాళ్లపూడిలోని పార్వతీ సహిత ఉమామహేశ్వరస్వామి, ప్రక్కిలంకలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి, వేగేశ్వరపురంలోని ఛాయ సోమేశ్వరస్వామి, అన్నదేవరపేటలోని సంగమేశ్వర స్వామి ఆలయాల్లో పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తిరుగుమెట్ట, బల్లిపాడు, పెద్దేవం, మలకపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో అర్చకులు స్వామివారికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. పట్టిసీమ వెళ్లే యాత్రికుల కోసం గోదావరి ఏటి గట్టుపై దాతల సహకారంతో పలు చోట్ల పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. అన్నసమారాధనలు నిర్వహించారు.

శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

గోపాలపురం: మహా శివరాత్రి సందర్భంగా బుధవారం శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక ఉమారామలింగేశ్వరస్వామి, కరిచర్లగూడెం స్వయంభు జల లింగేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గోపాలపురం మండలం దొండపూడి, రాజంపాలెం, గుడ్డిగూడెం, జగన్నాథపురం, చిట్యాల, సాగిపాడు గ్రామాల్లోని శివాలయాల వద్ద భక్తులు క్యూ కట్టారు. రాజంపాలెం షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. రాత్రి ఆలయాల వద్ద ప్రవచనాలు, శివనామశ్మరణ ఏర్పాటు చేశారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

నల్లజర్ల: మహా శివరాత్రి పర్వదినాన శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కల్యాణోత్సవాలను తిలకించేందుకు, స్వామివారిని దర్శించుకునేందుకు బుధవారం తెల్లవారుజాము నుంచే శివాలయాల వద్ద భక్తులు బారులు తీరారు. మహా శివునికి పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్లరసాలు, విబూదితో అభిషేకాలు, మారేడు దళాలతో అర్చనలు చేశారు. అనంతపల్లిలోని వేగిలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరిగింది. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రికి స్వామివారిని రథంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా నామ సంకీర్తన జరిగింది. పోతవరంలో ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త పాపా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరిగింది. దూబచర్ల–గంటావారిగూడెం గ్రామాల మధ్యనున్న లలితా కామేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ తాతిన సత్యనారాయణ తెలిపారు. తెలికిచెర్ల ప్రకటేశ్వరాలయం, నల్లజర్లలో ఉమాచంద్రమౌళీశ్వరాలయం, ఘంటావారిగూడెం –దూబచర్ల మధ్యనున్న లలితా కామేశ్వరాలయం, పోతవరం, శింగరాజుపాలెం, శివాలయాల్లో కల్యాణోత్సవాలు జరిగాయి.

దేవరపల్లి: హరహర మహాదేవ.. శంభోశంకర అంటూ భక్తులు శివనామస్మరణ చేశారు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా బుధవారం దేవరపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని శైవక్షేత్రాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామున 3 గంటల నుంచి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి 5 గంటల నుంచి దర్శనం కల్పించారు. ఉదయం 7 గంటల వరకు ఆలయాల వద్ద అంతంత మాత్రంగా ఉన్న భక్తులు అనంతరం రద్దీ ఏర్పడింది. మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తులు ఆలయాల వద్ద బారులు తీరి స్వామి వారిని దర్శించుకున్నారు. గౌరీపట్నంలోని గౌరీ సమేత మహాలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. దేవరపల్లి, చాగల్లు, గోపాలపురం, కొవ్వూరు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి గంటల తరబడి నిలబడి స్వామి వారిని దర్శించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, పలువురు అధికారులు, స్వామిని దర్శించుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తుల రద్దీ ఏర్పడింది. ఇక్కడ శివలింగం బ్రహ్మసూత్రం కలిగి ఉండడంతో భక్తులు విశేషంగా పాల్గొని దర్శించుకున్నారు.



నిడదవోలులో గోలింగేశ్వరస్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



వేగేశ్వరపురంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



బ్రాహ్మణగూడెంలో భక్తులతో రద్దీగా ఉన్న శివాలయం

గోదావరి జలాలతో అభిషేకం

దేవరపల్లి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం గౌరీపట్నంలో వేంచేసిన గౌరీ సమేత మహాలింగేశ్వరస్వామికి గోదావరి జలాలతో అభిషేకం చేశారు. కొండగూడెంలోని త్రివేణి గ్లాస్ షీట్ ఫ్యాక్టరీ ఉద్యోగులు గోదావరి నుంచి జలాలను కావళ్లతో తీసుకు వచ్చి మహాలింగేశ్వరస్వామికి అభిషేకించారు. సుమారు 20 మంది భక్తులు కావడి యాత్ర ద్వారా గోదావరి జలాలను దాదాపు 15 కిలో మీటర్లు తీసుకువచ్చారు.



కొవ్వూరు నుంచి గౌరీపట్నానికి కావడి యాత్ర చేస్తున్న భక్తులు



అనంతపల్లిలో వేగిలింగేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీ అమ్మవారి కల్యాణోత్సవం



దేవరపల్లి మండలం గౌరీపట్నంలో వేంచేసిన గౌరీ సమేత మహాలింగేశ్వరస్వామి



దేవరపల్లిలో పార్వతీ సమేత ఉమారామలింగేశ్వరస్వామి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు



పల్లంట్లలో దుర్గామల్లేశ్వరస్వామిని దర్శించుకున్న ఆర్డీఓ సుస్మితకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ కమిటీ

పుల్ల మాఫియాకు కాసుల పంట

- యథేచ్ఛగా చెట్ల నరికి వేత
- అక్రమంగా కలప తరలింపు

దేవరపల్లి: పోలవరం కుడి కాలువ, తాడిపూడి ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువ గట్లపై ఉన్న చెట్లపై అక్రమ వ్యాపారుల కన్ను పడింది. దీంతో కొంత కాలంగా పుల్ల మాఫియా గట్లపై గల చెట్లను నరికి రూ.లక్షలు సంపాదిస్తోంది. ప్రస్తుతం పొగాకు క్యూరింగ్‌లు ముమ్మరంగా జరుగుతున్నందున పుల్లకు డిమాండ్ ఏర్పడింది. టన్ను పుల్ల సుమారు రూ. 4 వేలు పలుకుతోంది. దీంతో పుల్ల వ్యాపారులు గట్లపై చెట్లను నరికి అక్రమంగా రవాణా చేస్తున్నారు. గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, తాళ్లపూడి మండలాల నుంచి ప్రతి రోజు సుమారు వందల టన్నుల పుల్ల వ్యాపారం జరుగుతుంది. అయినా సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీలు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గట్లపై గల వేప, చింత, తుమ్మ వంటి చెట్లను నరికి వేస్తున్నారు. దాదాపు 10 సంవత్సరాల వయసున్న వాటిని నేల కూల్చి వేస్తున్నారు. దేవరపల్లిలో ఒక వ్యక్తి కాలుపై గల చెట్లను నరికి పుల్లను రెండు వ్యాన్లలో పొగాకు బ్యారన్లకు బుధవారం తరలిస్తుండగా పంచాయతీ సిబ్బంది అడ్డుకున్నట్టు తెలిసింది. అయితే అడ్డుకున్న వాహనాలు, పుల్లను చడీ చప్పుడు లేకుండా విడిచిపెట్టినట్టు సమాచారం.ఒక లారీ పుల్లకు రూ. 30 నుంచి 40 వేలు ఆదాయం వస్తోంది. ఇప్పటికైనా అధికారులు అక్రమ పుల్ల వ్యాపారాన్ని అరికట్టి చెట్లను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.



దేవరపల్లిలోని పోలవరం కుడి కాలువ గట్టుపై చెట్లను నరికి అక్రమంగా రవాణా చేస్తున్న కలప

శరీరమంతా సూదులు, శూలాలు

చాగల్లు: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని బ్రాహ్మణగూడెం, ఊనగట్ల గ్రామాల్లో భక్తులు వింత ఆచారం పాటిస్తారు. శరీరమంతా సూదులు, శూలాలను ధరించి శివునికి మొక్కుకుంటే కోరిన కోర్కెలు తీరతాయని ఇక్కడ భక్తుల నమ్మకం. ఈ మేరకు బుధవారం బ్రాహ్మణగూడెం బాలరామలింగేశ్వరస్వామి, ఊనగట్ల, ధారవరంలో స్వామివారి ఊరేగింపు సందర్భంగా భక్తులు సూదులు, శూలాలు గుచ్చుకుని గ్రామంలో యాత్ర నిర్వహించారు. బ్రాహ్మణగూడెంలో స్వామివారి ఊరేగింపు అంగరంగవైభవంగా జరిగింది. సుమారు 450 మంది భక్తులు ఒంటి నిండా సూదులు ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు. ఊనగట్లలో భక్తులు శూలాలు శరీరంపై గుచ్చుకున్నారు. శరీరంపై సూదులు గుచ్చుకోవడం చూసే వారికి ఒళ్లు గగుర్పొడిచినా భక్తులు మాత్రం తన్మయత్వంతో ఉంటారు. చిన్నపిల్లలు, పెద్దలు, యువకులు అందరూ ఈ శూలాలు ధరించడం ఆనవాయితీగా వస్తోంది. వైఎస్సార్ సీపీ నేత ఆత్కూరి దొరయ్య మాట్లాడుతూ బాలరామలింగేశ్వరస్వామి నమ్మకంతోనే భక్తులు ఈ విధంగా శూలాలు ధరిస్తారన్నారు. వేలాది భక్తులు శూలాల సంబరాన్ని తిలకించారు.



బ్రాహ్మణగూడెంలో సూదులు ధరించిన భక్తులు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన

దేవరపల్లి: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లను బుధవారం తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. దేవరపల్లిలో మండల పరిషత్ ప్రాథమిక మెయిన్ స్కూల్లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో యర్నగూడెం, సంగాయగూడెం, చిన్నాయగూడెం, యాదవోలు, త్యాజంపూడి, గౌరీపట్నం, దుద్దుకూరు, బందపురం, రామన్నపాలెం, ధుమంతునిగూడెం, కృష్ణంపాలెం గ్రామాలకు చెందిన 1588 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉందన్నారు. స్థానిక అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో దేవరపల్లి, లక్ష్మీపురం, పల్లంట్ల, కురుకూరు గ్రామాలకు చెందిన 578 మంది ఓటర్లు తమ ఓటు వేస్తారన్నారు. మండలంలో మొత్తం 2166 మంది ఓటర్లు ఉన్నట్టు తహసీల్దార్ రాజ్యలక్ష్మి తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

గోపాలపురం: ఉభయ గోదావరి జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. బుధవారం ఎన్నికల సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ కె.అజయ్‌బాబు తెలిపారు. గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాలకు సంబంధించి మొత్తం 6443 మంది ఓటర్లు ఉండగా 10 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గోపాలపురంలో 1777 మంది, దేవరపల్లిలో 2166 మంది, నల్లజర్ల మండలంలో 2500 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.



దేవరపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి



గోపాలపురం పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందితో తహసీల్దార్ అజయ్‌బాబు